

# మధురస్మృతి

మారసాని విజయ్‌బాబు

## 1

స్పృహ వచ్చేసరికి ఆస్పత్రిలో వున్నాను.

బర్మర్‌తో యెవరో తలను తొలుస్తున్నట్టు నొప్పి. భరించలేకపోతున్నాను. యెదురుగా నా భార్య యెర్రక్క, కూతురూ అల్లుడు, కొడుకూ కోడలు, కొందరు స్నేహితులు, పరిచయస్థులు, చుట్టు పక్కల వాళ్లు గుమికూడి వున్నారు. నేను కళ్లు తెరవగానే వారి ముఖాల్లో వొక్కసారిగా ఆనందం కదలాడింది.

తలను తడిమి చూసుకున్నాను. పెద్ద కట్టే కట్టారు. ప్రాణాన్ని యెవరో గుంజేస్తున్నట్టు శరీరం బాధగా మూల్గింది. యిక నేను యెంతో సేపు బతకనన్న సంగతి స్పష్టంగా గోచరమవుతోంది.

జీవితంలో ప్రతి క్షణం అప్రమత్తంగావుండే నాకు యిలా జరుగుతుందనుకోలేదు. కేవలం మనం అప్రమత్తంగా వుంటేనే సరిపోదు. అవతలి వాళ్లు కూడా వుండాలనే జ్ఞానం మొట్టమొదటి సారిగా అనుభవంలోకి వచ్చింది. అయినా యీ అనుభవం నిష్ప్రయోజనం.

నా భార్య మాటల ద్వారా తెలిసింది. నేను రెండ్రోజుల నుంచి స్పృహ లేకుండా వున్నానని.

మొన్న రాత్రి జరిగిన సంఘటన గుర్తొచ్చింది.

11 గంటలకు రేణిగుంట నుంచి స్కూటర్‌లో యింటికి వస్తున్నాను. మూడో మైలు మలుపు తిరుగుతుండగా, వెనక నుంచి యేదో వాహనం ఢీ కొట్టింది. "ధన్..."మన్న ఆ శబ్దానికి గూబతో పాటు గుండెకూడా అదిరింది. ఆ వెనువెంటనే కళ్లముందు దేదీప్యమైన నక్షత్రాలు మెరిశాయి. ఆ అనంతమైన వెలుగును భరించలేక కనురెప్పలు అప్రయత్నంగా మూతలు పడ్డాయి. ఆ తర్వాత యేం జరిగిందో గుర్తురావడం లేదు.

మౌనంగా రోదిస్తున్న నా భార్య వైపు చూశాను. చింతించవద్దు అన్నట్టుగా ఆమె భుజంపై తట్టాను. నా చేతి స్పర్శతో ఆమె దు:ఖం మరింత యెక్కువైంది.

"వూరుకో. నేనెప్పుడూ చెబుతుంటాను కదా. మన చేతుల్లో యేదీ వుండదని" అన్నాను.

"మీరు లేని జీవితం నాకు నరకం. ఆ భగవంతుడు నన్ను తీసుకుపోయినా బాగుండేది" అని అంది.

దాని మాటలకు నాకు నవ్వొచ్చింది. యెప్పుడూ వేపన పెట్టే నా భార్య అలా మాట్లాడే సరికి. నా నవ్వును విని వెనక నుంచి యెవరో గుసగుసలాడారు.

"సంధి కొట్టింది. యిలాంటి పరిస్థితుల్లో నవ్వడమేమిటి. యిక యెక్కువ సేపు బతకడు".

ఆ మాటలకు మరోసారి నవ్వొచ్చింది. అంత బాధలోంచి కూడా ...

** **

నా జీవితం మొత్తాన్ని తర్కించుకున్నాను.

వో సామాన్యమైన రైతు కుటుంబంలో పుట్టాను నేను. చాలీ చాలని వర్షాలు... పంటలు సరిగా పండకపోవడంతో చిన్నప్పటి నుంచే బతుకుపై ఆరాటం మొదలైంది. పగలనకా రేయనకా సేద్యం చేస్తూ స్కూలుకు వెళ్లేవాడిని. చదువుకునేందుకు క్షణం తీరిక దొరికేది కాదు. పైగా ఆ చదువు యెడ తెగని విసుగనిపించేది. యెలాగో డిగ్రీ పూర్తిచేశాను. ఆ తర్వాత వుద్యోగం కోసం రెండు సంవత్సరాలు ప్రయత్నించినా దొరకలేదు. సేద్యం ఆడికాడికే వుంది. యిక తప్పని పరిస్థితుల్లో అయిదు వేలు అప్పుచేసి తిరుపతిలో టిఫెన్ సెంటర్‌ను పెట్టుకున్నాను. శుభ్రమైన వాతావరణంతో పాటు, టిఫిన్ రుచిగా వుండేందుకు చాలా శ్రద్ధ తీసుకున్నాను. ఆర్నెళ్లలో అప్పు తీరిపోయింది. ఆ తర్వాత మా అమ్మా నాయిన్లను తిరుపతికి పిలుచుకొని వచ్చేశాను. వాళ్లకు యే యిబ్బంది రాకుండా నా శక్తి మేరకు చూసుకున్నాను. నన్ను కన్నందుకు వాళ్లు చాలా సంతోషించారు. వాళ్ల కళ్లల్లో ఆనందాన్ని చూసుకొని నా కష్టాన్ని మరచిపోయే వాడిని.

కొన్నాళ్ల తర్వాత, మా అమ్మానాన్న బంధువుల అమ్మాయి యెర్రక్కకు నాకు పెళ్లి చేశారు.

శోభనం రాత్రి యెర్రక్క చిన్న కోరిక కోరింది.

"యేమండీ మనకో టీవి వుండే బాగుంటుంది" అని అంది. ఆ నాటి నుంచి సాధ్యమైనంత వరకు డబ్బు కూడపెట్టాను. టివీని కొన్నాను. ఆ తర్వాత ఫ్రిజ్, స్కూటర్, పిల్లల చదువులు, పెళ్లిళ్లు. తిరుపతిలో వో చిన్న యిల్లు కట్టుకోవడం... డబ్బులు కూడపెట్టడం... అన్నీ గుర్తొచ్చాయి. యీ మొత్తం జీవితంలో విసుగు, నిరంతర పని తప్పా మరొకటి లేకపోయింది. పెద్దగా సుఖపడిందేం లేదు. యెప్పుడూ ఆరాటమే వుండేది. వయస్సు మళ్లిన తర్వాత సుఖపడుదామనే యిదంతా చేశాను. అనుభవించే అదృష్టం లేకపోయింది. అయితే నేం నా భార్య పిల్లలు అనుభవిస్తారు కదా అని అనుకున్నాను. అయినా తెలియని దిగులు, వెలితి నా మనసంతా నిండుకొంది. శరీరం బాధ పెడుతోంది.

వున్నట్టుండి యమున గుర్తొచ్చింది.

వొక్క సారిగా నా శరీరంలోని అణువణువు ఆనందంతో నిండిపోయింది. అసలు యమున పరిచయమే చిత్రంగా జరిగింది.

## 2

యిరవై యేళ్ల కిందటి సంగతి యిది.

ఆ రోజు రాత్రి టిఫిన్ సెంటర్‌ను కట్టేసిన తర్వాత మా అత్త కొడుకు పెళ్లికి నా భార్య యెర్రక్క, పిల్లలతో పాటు బయల్దేరాను. బస్టాండ్ చేరుకునేసరికి 11 గంటలు అయింది. పొద్దున నాలుగు గంటలకు పెళ్లి. మదనపల్లెలో. అరగంట తర్వాత బస్సు వచ్చింది. అది అనంతపూర్ బస్సు. ఆ బస్సులోని సీట్లు ముందుగానే రిజర్వు అయిపోయాయి. బిడ్డలతో పాటు నిలబడి అంత దూరం పయనం చేయడం కష్టమని తెలిసినా బస్సెక్కక తప్పలేదు. తర్వాత నాలుగు గంటలకు గానీ బస్సు లేదు.

బస్సెక్కిన మేం డ్రైవర్ వైపుగా నిలబడ్డాం. యెవరో వొకాయన పాపను తీసుకొని తన వొడిలో కూర్చోపెట్టుకున్నాడు. మరో ఆమె కొంచెం జరిగి బాబుని తన పక్కన కూర్చోపెట్టుకొంది.

పిల్లల సమస్య తీరగానే నా మనసు కాస్త కుదుటపడింది.

కొంత సేపు తర్వాత బస్సు బయలుదేరింది.

"నూట పదహార్లన్నా చదివించకపోతే బాగుండదు. తక్కువగా అనుకుంటారు" అంది యెర్రక్క.

"అలాగే" అన్నాను నేను.

నా పక్క సీట్లో యిద్దరు ఆడోళ్లు. వాళ్ల మధ్యలో వో పదేళ్ల పాప కూర్చొని వున్నారు. ఆ సీటు మొదట్లో కూర్చున్న ఆమెతో..."యేమండీ పాపను కాస్త దగ్గరికి తీసుకుంటే యింకొకరు కూర్చోవచ్చు" అన్నాను. యెర్రక్కకు సీటు దొరికితే బాగుంటుందని.

"మా పాప కాదండీ. యిందాక కూడా యెవరో అడిగారు.అయినా వాళ్లు జరుక్కోలేదు" అంది ఆమె.

**దేదీష్యమానంగా ఆమె ముఖం వెలుగుతోంది. నా స్వర్శకు అంతరాయం కలగకుండా మౌనంగా అనుభవిస్తున్న అనుభూతి ఆ మొఖంలో ప్రతిఫలిస్తోంది**

వాళ్ల వైపు చూశాను నేను. వాళ్లసలు మా మాటలు పట్టించుకునేటట్టు లేరు.

యిక చేసేదేంలేనట్టు వూరుకున్నాను.

బస్సు యూనివర్శిటీ దాటే లోపు రిజర్వేషన్ టిక్కెట్లను చెక్ చేసుకొని, మిగిలిన వాళ్లకు టిక్కెట్లు కూడా యిచ్చేశాడు కండెక్టర్.

యీ లోపు యిందాక నాతో మాట్లాడిన ఆమె వైపు నాలుగైదు సార్లు చూశాను. ఆమెను చూస్తున్న కొద్దీ యింకా చూడాలనిపిస్తోంది. యేదో ప్రత్యేక ఆకర్షణ వుంది ఆమెలో. చిత్రమైన స్పందన కలిగింది నాలో. యెర్రక్కతో మాట్లాడుతూనే అప్పుడప్పుడూ ఆమె వైపు చూస్తున్నాను. ఆమెతో మాట్లాడాలనే కోరిక పుట్టింది. అయితే యేం మాట్లాడాలో తెలియలేదు.

కండెక్టర్ యెస్ఆర్ పూర్తి చేసుకుంటున్నాడు.

మరెంతో సేపు లైట్లు వుండవు. నా మనసు పోరింది ఆమెతో మాట కలపమని. చివరికి ధైర్యం చేసి, "మీరెంత వరకు వెళుతున్నారండీ" అని అడిగాను.

"అనంతపూర్‌కు".

"మీ వూరు అనంతపూరేనా".

"అవును".

యింతలో లైట్లు ఆఫ్ చేశారు.

"తిరుమలకు వచ్చారా"

"కాదు. మా బంధువుల పెళ్లికి వచ్చాను".

"వొక్కరే వచ్చారే".

"మా ఆయన రావడానికి వీలు కాలేదు. ఆఫీసులో పని కారణంగా" అంది ఆమె.

"మీరు కూడా వుద్యోగం చేస్తున్నారా".

"అవును. అనంతపూర్ జూనియర్ కాలేజీలోనే లెక్చరర్‌గా చేస్తున్నాను".

"మీ పేరు".


"యమున".

యెర్రక్కకు నిద్ర ముంచుకు వస్తోంది. ఆమె నా భుజంపైకి వాలింది.

"వొక్క క్షణం వుండు" అని యెర్రక్కకు చెప్పి, పైన పెట్టిన సూట్‌కేసును కిందకు దించాను.

"దీనిపై కూర్చో" అని అన్నాను.

యెర్రక్క సూట్‌కేసుపై కూర్చుంది. కొంత సేపు తర్వాత పక్కసీటును ఆనుకొని నిద్రలోకి జారుకుంది.



బస్సు రంగంపేట మలుపు తిరుగుతుండగా అప్రయత్నంగా ముందు సీటుపై నున్న యినపరాడ్‌ను పట్టుకున్నాను నేను.

ఆ వెను వెంటనే గ్రహించాను. సరిగ్గా నా చేతి కింద సీటును పట్టుకొని ఆమె చేయి వుంది. మా యిద్దరి చేతుల మధ్య దూరం వేలుడంతా కూడా లేదు. ఆమె శరీరం వెదజల్లుతున్న వేడి సెగలు నా చేతికి తగులుతున్నాయి. ఆ వేడి నాలో యెన్నడూలేని నూతన కాంక్షను రేపింది.యేదో తెలియని ఆకర్షణకు లోనయ్యాను. ఆమె చేతిని తాకాలని నా మనసు పురికొల్పుతోంది. యెర్రక్క వైపుచూశాను. ఆమె మంచి నిద్రలో వుంది. బస్సులోని అందరి పరిస్థితి కూడా యించు మించు అలానే వుంది. యమున కూడా సీటుకు జారగిలి కళ్లు మూసుకొని వుంది.

నా కోరిక రాన్రాను పెరిగిపోతోంది. అదుపు చేయలేకపోతున్నాను. చివరికి 'యేమైతే, అవ్వనీ' అని అనుకున్నాను.

చేతిని యధాలాపంగా వెనక్కు తీసుకుంటున్న వాడిలా ఆమె చేతిని తాకాను.

'అబ్బా యెంత వేడి...'కాలిన యినుమును తాకినంతగా ఫీలైయ్యాను.

ఆమె మౌనంగా వుంది. నిద్రపోతోందా?. హూహూ... యింతలోనే నిద్రపట్టి వుండదు. నేను కావాలని చేతిని తాకిన విషయం ఆమెకు తెలిసుంటుంది. అయితే ఆమె నుంచి యెలాంటి స్పందన రాలేదు.

కొంతసేపు వోపిగ్గా యెదురు చూసిన తర్వాత... తిరిగి అదేచోట పట్టుకున్నాను. ఆమె చేయి అలానే వుంది. బరువుగా క్షణాలు దొర్లుతున్నాయి. మరో చేత్తో నేను పై నున్న యినపరాడ్‌ను పట్టుకున్నాను. ఆ చేతి పైకి తలను వాల్చేసి నిద్రపోతున్న వాడిలా ఫోజు పెట్టాను. నిద్రలో పట్టుసడలినట్టు నా కుడిచేతి వేళ్లు ఆమె చేతిపైకి జారిపోయాయి. ఆ స్పర్శ కొత్తలోకాల్లోకి నన్ను తీసుకెళ్లింది. చేతిని వెనక్కు తీసుకోలేకపోతున్నాను. ఆమె నిజంగానే నిద్రపోతోందేమో! లేకపోతే యింతటి సంఘటనకు కూడా చలించకపోవడమేమిటి?.

ఆ చలికాలం రాత్రి. ఆమె వెచ్చని స్పర్శ... అద్భుతంగా వుంది. వొక వేళ ఆమె నిద్ర మేల్కొంటే... మేల్కొవడమేమిటి... ఆమె నిద్ర పోవడంలేదని నా అంతరాత్మ నికరంగా చెబుతోంది. వొక్కసారిగా యేదో తెలియని ఆనందం నన్ను చుట్టుముట్టింది. నాలో ఉన్నఫళంగా ధైర్యం పెరిగిపోయింది. దాంతో నా అంతరంగంలో నిబిడీకృతమైన కాంక్షను ఆమెకు తెలియపరుస్తున్నట్టు నా చేతి వేళ్లు కదులుతున్నాయి. అయినా ఆమె మూసిన కన్ను తెరవలేదు. బస్సు మలుపు తిరిగిన ప్రతిసారి నా శరీరం మొత్తం ఆమెను తాకుతోంది.

యెదురుగా వస్తున్న బస్సులైట్లు మా బస్సులోకి పడగానే చేతిని వెనక్కు తీసుకొని ఆమె వైపు చూశాను.

దేదీప్యమానంగా ఆమె ముఖం వెలుగుతోంది. నా స్పర్శకు అంతరాయం కలగకుండా మౌనంగా అనుభవిస్తున్న అనుభూతి ఆ మొఖంలో ప్రతిఫలిస్తోంది. యీ సారి నా చేతిని ఆమె యెడమ చేతి భుజానికి తగిలేలా వుంచాను. యిలా వొక్క నిమిషం గడిచిందో లేదో...

ఆమె ముందు సీటుపై తన చేతుల్ని వేసి వాటిపైకి తలను వాల్చింది. దాంతో నా చేయి ఆమె పొత్తి కడుపు పక్కగా తగిలింది. నరాలు జివ్వున లాగాయి. ఆమె నాకు అవకాశం కల్పించేందుకే అలా పడుకుందనిపించింది. చిన్నగా నా చేతి వేళ్లు ఆమె మృదువైన శరీరాన్ని తాకుతున్నాయి. నాలోని సందేహం కొద్దికొద్దిగా నివృత్తి అవుతోంది.యింతలో వున్నట్టుండి ఆమె నా చేతిని గట్టిగా పట్టుకొంది. వొక్కసారిగా నా ప్రాణం పైకెగసినట్టు అన్పించింది. భయపడిపోయాను. జగత్ప్రళయం నన్ను చుట్టుముట్టినట్టుగా ఫీలైయ్యాను. అయితే ఆమె నా చేతిని తన యెదపైకి లాక్కొని గట్టిగా అదుముకుంది. నా అంతరంగంలో యెక్కడో తటాలున జలదరింపు కలిగింది.

బస్సు భాకరాపేట ఘాట్ లోంచి అనంతమైన చీకటిలోకి పయనిస్తోంది...

** **

వాయల్పాడులో సీటు దొరికింది యెర్రక్కకు. నేను సూట్‌కేసును కొంచెం ముందుకు జరిపి యమున వైపు తిరిగి కూర్చున్నాను. ఆమె నేను తేరిపారా చూసుకున్నాం.మా యిద్దరి ముఖాల్లోనూ అనిర్వచనీయమైన భావం, కొత్త ఆనందం కదలాడుతోంది.

తిరిగి బస్సు బయలుదేరింది.

యెర్రక్క కూడా తిరిగి నిద్రలోకి జారుకుంది.

నేను నా అడ్రసు, ఫోన్ నెంబర్‌ను వో కాగితంపై రాసి యమునకు యిచ్చాను.

ఆమె తీసుకొని తన హాండ్‌బ్యాగ్‌లో వుంచుకుంది. తరువాత బిగ్‌షాపర్ బ్యాగ్ లోంచి చిన్న ప్యాకెట్ తీసి. అందులోంచి జీడిపప్పును తీసి కొన్నింటిని నాకు పెట్టింది. తానూ తింటూ...

"నేనెవ్వరో, నా యిష్టా యిష్టాలేమిటో మీకు తెలియవు. అలాంటప్పుడు నన్ను తాకాలనే ధైర్యం యెలా వచ్చింది."

"మిమ్మల్ని చూడగానే నాకత్యంత సన్నిహితమైనదేదో దొరికిన భావన కలిగింది. పైగా మీ శరీరం వెదజల్లే వేడికి తట్టుకోలేకపోయాను.సహజసిద్ధమైన స్త్రీ ఆకర్షణను

పురుషుడు నిగ్రహించుకోవడం యెంత కష్టం. అయినా కంట్రోల్ చేసుకోవడానికి నేను చేసిన ప్రయత్నం విఫలమైంది. గతంలో నాకెప్పుడూ యిలాంటి అనుభూతి కలగలేదు" అన్నాను.

"జరగరానిది యేదైనా జరిగివుంటే."

"చేసిన పనికి పశ్చాత్తాపం పడే మనస్తత్వం కాదు నాది. యే పరిస్థితి యెదురైనా ఆహ్వానించి వుంటాను".

"మీ భార్య ముందు అగౌరవం జరిగివుంటే తిరిగి ఆమె ముఖాన్ని యెలా చూసుంటారు. కనీసం దానిని కూడా మీరు పరిగణించలేకపోయారే".

"జరగని దానిని వూహించుకోవడం యెందుకు..."

"వొకవేళ జరిగివుంటే...""



"ఆమె నన్ను అసహ్యించుకున్నా సరే నేను బాధ పడను. యెందుకంటే యిదేదో పొరపాటుగా జరిగిన సంఘటన కాదు. నా యిష్టపూర్వకంగా చేసిన దానిని కప్పిపుచ్చుకోలేను".

ఆమె నా చేతిని తన చేతుల్లోకి తీసుకొని ఆప్యాయంగా నొక్కి వదిలింది.

"యీరోజు మరచిపోలేనిది. తొమ్మిది గంటల బస్సు దొరకనందుకు అప్పుడు చాలా బాధపడ్డాను. తప్పిపోయినందుకు యిప్పుడు సంతోషిస్తున్నాను. మీలాంటి వారి పరిచయం కలగడం చాలా సంతోషంగా వుంది".

"నా గురించి యేం తెలిసిందని, అప్పుడే సర్టిఫికేట్ యిచ్చేస్తున్నారు."

యెదురుగా వస్తున్న వాహనం కాంతిలో ఆమె ముఖంపై తలుక్కుమని మెరిసిన చిరునవ్వును పట్టుకున్నాను నేను. ఆ నవ్వుతో నా మనసు కలగలిసి మధురానుభూతికి లోనైంది.

"మీరు మాట్లాడకపోయినా నేను చాలా విషయాలు గ్రహించాను. మీ ప్రతి కదలిక నా బాడీలాంగ్వేజ్‌ని సంపూర్ణంగా అర్థంచేసుకున్నట్టుగా, నా అంతరంగానికి ప్రతిబింబంలా వున్నింది. రెండుగంటల కిందట మీరు నా చేతిని తాకినప్పుడు దిగజారిన మనిషేమోనని అనుకున్నాను. అయినా చూద్దాం యేంచేస్తారోనని వోపిక పట్టాను. అయితే క్షణాల్లోనే నా అభిప్రాయాన్ని మార్చుకున్నాను. మీ లోని వాంఛ, యిష్టాన్ని తెలియజేస్తూ...అదే సమయంలో నా పట్ల మీకున్న గౌరవాన్ని వ్యక్తం అయ్యేలా మీ శరీరం చాలా హుందాగా సంకేతాల్ని పంపింది. అనురాగపు వర్షపు జల్లుల్ని కురిపించి నెర్రెలు వాసిన నా మనసుకు ఉపశమనం కలిగించింది. అంత కంటే ఆడది కోరుకునేది యింకేం వుంటుంది. థ్యాంక్స్ ఎ లాట్".

"మీ ఫోన్ నెంబర్ చెబుతారా" అని అడిగాను.

"మీరు ఫోన్ చేస్తే నాకు చాలా సమస్యలు యెదురవుతాయి".

"వద్దులే అయితే."

"థ్యాంకూ"

"దేనికీ"

"వెంటనే అర్థం చేసుకున్నందుకు. అలాగే దయచేసి లెటర్స్ కూడా రాయకండి".

"అలాగే, మీ యిష్టానికి వ్యతిరేకంగా యే పనీ చేయను. తిరిగి మిమ్మల్ని చూసే అదృష్టం కోసం యెదురు చూస్తుంటాను. మదనపల్లి వచ్చేసింది. వెళ్లిరానా."

"మంచిది. వెళ్లిరండి. మిమ్మల్ని తిరిగి కలుసుకోవాలనే ఆశతో నా మనసు కూడా ఆరాటపడుతోంది. అయితే పరిస్థితులు యెలా వుంటాయో తెలియదు కదా!" అంటూ కళ్లతోనే వీడ్కోలు చెప్పింది.

యెర్రక్కని పిల్లల్ని నిద్రలేపాను. బస్టాండ్ వచ్చినా నిద్రమత్తు నుంచి వాళ్లు బయటపడలేక పోతున్నారు. యీ లోపు రెండు సార్లు యమున వైపు చూస్తూ...

"వెళ్లొస్తాను నేస్తం" అన్నట్టుగా ముఖం పెట్టాను. అందుకు సమాధానంగా యేంతో అభిమానాన్ని, అప్యాయతను కురిపించాయి ఆమె కళ్లు.

** **

ఆరు నెలల తర్వాత...

వోరోజు...

"బాగున్నారా" అని అడిగింది ఫోన్‌లో వో స్త్రీ.

"మీ రెవ్వరండీ"

"గుర్తుపట్టండీ చూద్దాం".

"హూహూ... గుర్తురావడం లేదు. సారీ..."

"యమునను".

సంభ్రమాశ్చర్యం కలిగింది నాకు. నా అనందానకి హద్దులు లేకపోయాయి.

"మీరా, బాగున్నారా. మళ్లీ యెన్నాళ్ల తర్వాత...మీ పిలుపుకోసం నిరీక్షించని రోజు లేదు. ప్రతి క్షణం మీరు గుర్తొస్తున్నారు. నా మనసులోని మధుర స్వప్నం మీరు".

"రేపు తిరుపతిలో జరగనున్న సెమినార్‌కు యిక్కడి నుంచి చాలా మంది వస్తున్నాం. తిరుపతి భీమాస్‌లో దిగుతున్నాం".

"యెన్ని గంటలకు వస్తున్నారు".

"పొద్దున ఆరు గంటలకు చేరిపోతాం".

"బస్సులోనా".

"అవును".

"సరే నేను భీమాస్ దగ్గర యెదురు చూస్తుంటాను".

"వద్దండీ, పొద్దున హడావుడిగా వుంటుంది. త్వరత్వరగా రెడీ అయి సెమినార్‌కు వెళ్లాలి. సెమినార్ అయిన తర్వాత సాయంత్రం కలుద్దాం. నేను రూంకు వచ్చిన తర్వాత మీకు ఫోన్‌చేస్తాను. సరేనా" అంది.

"సరే అయితే".

"వుంటాను. ఐ లవ్ యూ" అంది.

"ఐ లవ్ యూ టూ" అన్నాను.

"బై..."అంటూ ఫోన్ పెట్టేసింది. నాలో తెలియని వుత్సాహం... వుత్తేజం... ఆనందం... వుత్కంఠ అన్నీ కలగలిసిపోయాయి.

** **

రూం నెంబర్ 301 ముందాగి కాలింగ్ బెల్ నొక్కాను. తలుపు తీసిన యమున లోనికి నన్ను సాదరంగా ఆహ్వానించింది. ఆ వెను వెంటనే తలుపు గడిపెట్టి...

ఆపాదమస్తకం నన్నల్లుకుపోయింది. నేను జలపాతాన్ని అయ్యాను. ఆమె అగాధంలా మారిపోయింది.

** **

అదే రోజు రాత్రి పదకొండు గంటలకు తాను వెళ్లిపోతుంటే నా మనసు తల్లడిల్లి పోయింది. ఆమెతోపాటే బస్సెక్కేశాను నేను కూడా.

"వద్దు, యిలాంటి పనులు చేయకండి. నాకు యిష్టం వుండదు. మిమ్మల్ని వదలిపెట్టి పోవడం నాక్కూడా యిష్టంలేదు. అయినా తప్పదు. వాస్తవాన్ని కూడా అర్థం చేసుకోవాలి. లేదంటే యిద్దరం చాలా యిబ్బంది పడాల్సివస్తుంది. దానికంటే యీ బాధే నయం. యింట్లో మీ భార్యాపిల్లలు యెదురు చూస్తుంటారు. బయలు దేరండి. యిప్పటికే చాలా ఆలస్యం అయ్యింది".

మరో అయిదు నిమిషాల్లో బస్సు నిర్దాక్షిణ్యంగా నా నుంచి ఆమెను తీసుకెళ్లి పోయింది. ఆనాటి నుంచి ఆమె రాకకోసం యెదురు చూస్తూనే వున్నాను...

## 3

నేనేమీ మాట్లాడకపోయే సరికి, యెర్రక్క యేడుపు యెక్కువైంది.

దాంతో యీ లోకంలోకి వచ్చి పడ్డాను నేను.

నా జీవితంలో మధురస్మృతి యమున. ఆమెతో గడిపిన కాలం అతి స్వల్పమే అయినప్పటికీ ఆమె అందించిన ప్రేమ, వాత్సల్యం, ఆత్మీయత అనంతమైంది. అయినా ఆమెకోసం నేను చేసింది యేమీలేదు. నా భార్యాపిల్లల కోసం అహర్నిశలూ కష్టపడ్డాను. అయినా వాళ్ల దగ్గర నుంచి రవ్వంత ఆత్మీయత కూడా పొందలేకపోయాను.. పైగా వాళ్లు, నేను పనిచేసి పోషించాలనే విషయాన్ని హక్కుగా భావించారు. నా ఆనందం కోసం, సౌఖ్యం కోసం వాళ్లెన్నడూ తపత్రయ పడలేదు. కనీసం ఒక్క వూరడింపు మాటైన అనలేకపోయారు. నాకు విశ్రాంతిని కలిగించాలని కూడా యెన్నడూ అనుకోలేదు. మా కుటుంబంలోనేకాదు, చుట్టుపక్కల వున్న చాలా కుటుంబాల్లోనూ యింత కంటే భిన్నమైన పరిస్థితులు నాకు కన్పించ లేదు. యిందుకేనా నేను యమునను అంతగా యిష్టపడుతోంది. తాను నా నుంచి యేమీ కోరుకోకుండానే అనంతమైన శాంతిని, ప్రశాంతతను, ఊరటను ప్రసాదించింది. అందుకే చెక్కుచెదరలేదు ఆమె రూపం నా మదినుంచి యేళ్ల తరబడి. ఆమె జ్ఞాపకాలు తలపుకొస్తే నా మనసంతా ఆనందంతో నిండిపోతుంది. అయినా మా సంబంధాన్ని అక్రమ సంబంధం అని లోకం అంటుందికదా! నీతి నియమాల్ని పక్కకు నెట్టి అనవసరమైన దానికి ప్రాధాన్యత నిస్తున్నానేమో! అదలా వుంచితే మనిషి ఆనందాన్ని హరిస్తున్న ప్రస్తుత వివాహవ్యవస్థ సక్రమ సంబంధం యెలా అవుతుందో కూడా అంతుపట్టడం లేదు.

'చెక్కుచెదరలేదు ఆమె రూపం నా మదినుంచి యేళ్ల తరబడి'

ఈ ప్రశ్న అనంతంలా నా ముందు విస్తరిస్తోంది.

** **

వొకవేళ నేను చనిపోయిన తర్వాత యమున వస్తే...

అప్పుడు తిరిగాయి నా కళ్లల్లో గిర్రుక్కున నీళ్లు. అవి పొంగి ప్రవహించాయి.

నా స్థితికి నా భార్య యెర్రక్క, పిల్లలు కూడా భోరున యేడుస్తున్నారు.

యేడవద్దన్నట్టుగా వాళ్లకు సైగ చేశాను.

యెలాగైనా సరే బతకాలనే కోరిక గాఢంగా నన్నల్లుకుంటోంది...